ఆన్‌లైన్ లావాదేవీలకే మొగ్గు..

- నియోజకవర్గంలో సుమారు 20 వేల మంది చిరు వ్యాపారులు
- ఎక్కడా చూసిన డిజిటల్ చెల్లింపులే



చిల్లర దుకాణంలో ఏర్పాటు చేసిన స్కానర్, స్పీకర్ బాక్స్

భోగాపురం: గతంలో ఇంటి నుంచి బయటకు వచ్చే ముందు జేబులో డబ్బు పెట్టుకుని వచ్చే వాళ్లం. ఇప్పుడు కాలం మారింది. టీ తాగాలన్నా , మార్కెట్‌లో సరుకులు, కూరగాయలు కొనుగోలు చేయాలన్నా జేబులో ఓ స్మార్ట్ ఫోన్, బ్యాంకు ఖాతాలో డబ్బు ఉంటే చాలు. లావాదేవీలను సులభంగా చేసుకోవచ్చు. గతంలో మాల్స్, పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు రోడ్డు పక్కన దుకాణాల చెంతకు వచ్చేశాయి. పేటీఎం, ఫోన్ పే, గూగుల్ పే, క్యూఆర్ కోడ్ స్కానర్ లేకుండా ఏ వ్యాపారీ కనిపించడం లేదు.

20 వేల దుకాణాలు

ప్రస్తుతం స్కానర్లు చిరు వ్యాపారులకు సైతం అందుబాటులోకి వచ్చాయి. డిజిటల్ లావాదేవీలు పెరగడంతో థర్డ్ పార్టీ నిర్వాహకులు అన్ని దుకాణల వద్దకు వెళ్లి పేమెంట్ స్కానర్లు, స్పీకర్లు పెడుతున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో మొత్తం టీ, టీఫిన్, తోపుడు బండ్లు, ఇస్త్రీ, చిల్లర దుకాణాల వంటివి దాదాపు 20 వేల వరకు ఉంటాయి. ఆయా దుకాణాల్లో రోజుకు సుమారు 70 వేల రూపాయల వరకు డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి.

కోవిడ్‌తో మార్పులు..

పెద్ద నోట్ల రద్దు అనంతరం ఆన్‌లైన్ లావాదేవీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. మొదట్లో పెద్ద పెద్ద పట్టాణాల్లో మాత్రమే ఆన్‌లైన్ చెల్లింపులు జరగ్గా.. కొన్ని కొన్ని అపోహలతో స్మార్ట్ చెల్లింపులు గ్రామీణ ప్రాంతాలకు చేరలేదు. 2019 కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీలు గణనీయంగా పెరిగి చెల్లింపుల్లో మార్పులు వచ్చాయి. పేమెంట్ యాప్‌లతో అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్, గ్యాస్, విద్యుత్ బిల్లులు, ఫుడ్ డెలివరీ, ఇతర అవసరాలకు ఆన్‌లైన్ ద్వారానే నగదు చెల్లిస్తున్నారు.

స్పీకర్‌తో అక్రమాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసానికి గురయ్యే అవకాశం ఉంది. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని కొందరు మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరుకులను కొనుగోలు చేసిన తర్వాత వేరే వారికి అమౌంట్ బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ సక్సెస్ ఫుల్ మెసేజ్‌ను దుకాణదారునికి చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. అయితే ఇటువంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్సులు అందుబాటులోకి వచ్చాయి. ఆన్‌లైన్ చెల్లింపులు జరగ్గానే ఎంత మొత్తం దుకాణదారుకు ఖాతాకు జమ అయినదీ వాయిస్ రూపంలో వినిపిస్తుంది.

డిజిటల్ చెల్లింపులే ఎక్కువ..

నేను కొన్నేళ్లుగా కూరగాయల వ్యాపారం చేస్తున్నాను. గతంలో నగదు లావాదేవీలు ఎక్కువ జరిగేటప్పుడు చిల్లర సమస్య ఏర్పడేది. చిల్లర ఇవ్వలేకపోతే కొనుగోలుదారులు సరుకులు వదిలేసి వేరే దుకాణానికి వెళ్లిపోయేవారు. ప్రస్తుతం నగదు రహిత లావాదేవీలే ఎక్కువగా జరుగుతున్నాయి. ఎటువంటి చిల్లర సమస్యలేదు. నా ఖాతాకు ఎంత మొత్తం వచ్చినదీ కూడా వాయిస్ రూపంలో చెబుతోంది.

పి. శ్రీధర్, కూరగాయల వ్యాపారి

చిల్లర సమస్య తప్పింది...

గతంలో ఇంటి నుంచి బయటకు రావాలంటే జేబులో డబ్బులు పెట్టుకోవాల్సిందే. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. నిత్యావసర సరుకుల నుంచి ఆటో చార్జీలు చెల్లించాలన్నా ఆన్‌లైన్ పేమెంటే ఆధారం . గతంలో కొనుగోలు చేసిన సరుకుల ధర కన్నా ఎక్కువ అమౌంట్ ఇస్తే చిల్లర లేదనే సాకుతో వ్యాపారి మనకు అవసరం లేకపోయినా వేరే సరుకులు అంటగట్టేవాడు. ప్రస్తుతం చిల్లర సమస్య తప్పడంతో.. మనకు ఏం కావాలో, ఎంత కావాలో అంతే కొనుగోలు చేసుకుంటున్నాం.

కె. రామకృష్ణ, కొనుగోలుదారుడు

మర్యాదపూర్వక కలయిక..



జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత గురువారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె వెంట మంత్రి కొండపల్లి శ్రీనివాస్, నెల్లిమర్ల, ఎస్.కోట, విజయనగరం ఎమ్మెల్యేలు లోకం మాధవి, లలితకుమారి, అదితి గజపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం రూరల్

క్లుప్తంగా

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని రెండో వార్డులో గల కొండపేటలో జరుగుతున్న పారిశుధ్య పనులను నగర పంచాయతీ కమిషనర్ కె. అప్పలరాజు గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువల్లో చెత్త వేయరాదని ప్రజలకు సూచించారు. చెత్తను బుట్టల్లో వేసి పారిశుధ్య సిబ్బందికి అందించి సహకరించాలని కోరారు. అనంతరం 2వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా వార్డు సందర్శన


14వ డివిజన్‌లో వార్డు సందర్శన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం నిర్వహించిన వార్డు సందర్శన కార్యక్రమం తూతూమంత్రంగా సాగింది. అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం 14వ డివిజన్ పరిధిలోని 17వ సచివాలయంలో పర్యటించారు. డివిజన్ పరిధిలో పారిశుధ్యం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు మాట్లాడుతూ.. ప్రజలు తెలియజేసిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మద్యం షాపు తొలగించండి..

- కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చిన కుమిలి గ్రామస్తులు


కలెక్టర్‌ను కలిసిన కుమిలి గ్రామస్తులు

విజయనగరం అర్బన్: తమ గ్రామంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, 20 వీధులతో ఉన్న గ్రామంలో సుమారు పది వేల మంది జనాభా ఉన్నారన్నారు. ప్రధాన వీధిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణానికి సమీపంలోనే బడి, గుడి, గ్రంథాలయం ఉన్నాయన్నారు. తాగుబోతుల వల్ల మహిళలు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తక్షణమే షాపు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్, తెలుగుదేశం మండల నాయకుడు దల్లి ముత్యాల రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2024 – 25 ఏడాదికి సంబంధించి ఐదో విడత మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 26లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27లోగా దగ్గరలోని ఐటీఐలో 10వ తరగతి, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తదితర ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని అన్నారు. వివరాలకు 9000096048, 8309438446, 9959502238, 9052085679 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న తహసీల్దార్ గోవింద

- తహసీల్దార్ తాడ్డి గోవింద

పూసపాటిరేగ: రీ సర్వే పూర్తయిన గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ తాడ్డి గోవింద కోరారు. రీ సర్వేలో చోటుచేసుకున్న తప్పులను సరిచేసుకోవడానికి ఈ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మండలంలోని కొప్పెర్లలో గురువారం సదస్సు నిర్వహించి పలువురు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా.. మరికొన్నింటిపై విచారణ చేపట్టి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ కల్యాణి, సర్వేయర్ గణపతిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి, సర్పంచ్ శంకాబత్తుల సత్తిబాబు, వైస్ సర్పంచ్ లంకలపల్లి రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడని వైద్యులు

- సుందరపేట సీహెచ్‌సీలో రోగులను పట్టించుకోని వైనం


సుందరపేట సీహెచ్‌సీ

భోగాపురం: గుర్ల మండలంలో డయేరియా ప్రబలి పదుల సంఖ్యలో ప్రజలు చనిపోతుంటే.. అప్రమత్తంగా ఉండాల్సిన వైద్యులు ఇంకా నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. భోగాపురం మండలం సుందరపేట సీహెచ్‌సీకి బుధవారం రాత్రి భోగాపురం గ్రామానికి ఆళ్ల లక్ష్మి వాంతులు, విరోచనాలతో బాధపడుతూ చికిత్స నిమిత్తం వెళ్లింది. ఆమెకు ప్రథమ చికిత్స చేసిన తర్వాత పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో బాత్రుమ్‌లో స్పృహ తప్పి పడిపోయింది. అక్కడకు కొద్ది సేపటి తర్వాత ఆమెను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని వైద్యాధికారి వెంకటేష్‌ను వద్ద ప్రస్తావించగా.. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు భార్గవి

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని కె. భార్గవి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం రేవళ్ల ఆదినారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్. సూర్యనారాయణ తెలిపారు. రఘుమండలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో భార్గవి ప్రతిభ కనబరిచిందని చెప్పారు. బాపట్లలో నవంబరు 9 నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ మేరకు విద్యార్థినిని గురువారం అభినందించారు.

సహకారాన్ని సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన కమిషనర్ నల్లనయ్య

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: మహిళల ఆర్థిక స్వావలంబనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక విజయనగరం కార్పొరేషన్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల రిసోర్స్‌పర్సన్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక విధాలుగా కృషి చేస్తున్నాయన్నారు. ఆయా పథకాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని, ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రధానమంత్రి స్వనిధి, పీఎం విశ్వకర్మ యోజన, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాల పట్ల మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటిలోనూ సౌర విద్యుత్ వెలుగులు నింపాలన్నదే ప్రభుత్వాల ప్రధాన ఆశయమని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వాలు రాయితీని కూడా కల్పిస్తున్నాయని తెలిపారు. అలాగే పీఎం స్వనిధి ద్వారా పథకాల మంజూరుకు ఈ నెలాఖరులోగా లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. నెలాఖరులోగా 1780 సంఘాలకు రుణాలు మంజూరయ్యే విధంగా చూడాలన్నారు. సమావేశంలో టీపీఆర్‌ఓ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

వారికి నచ్చినప్పుడే హాజరు..

- అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అంతంతమాత్రమే


వి.టి. అగ్రహారం కేంద్రంలో 23, 24 తేదీల్లో వేయని హాజరు


రెడ్డివీధి అంగన్‌వాడీ కేంద్రంలో ఏడుగురు పిల్లలకు ఉన్నది నలుగురే

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలకు హాజరు సమయానికి వేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పిల్లలు తక్కువ సంఖ్యలో వచ్చినప్పటికీ అందరికీ హాజరు వేస్తున్నట్లు విమర్శలున్నాయి. అధిక శాతం కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఉదయం 9.30 గంటలకు చిన్నారులు కేంద్రానికి రాగానే హాజరు వేయాలి. కాని సిబ్బంది మాత్రం ఒంటి గంట వరకు కూడా హాజరు వేయడం లేదు. కొన్ని కేంద్రాల్లో రెండు, మూడు సెంటర్లు నిర్వహిస్తూ, అందరికీ ఒకేసారి హాజరు వేస్తున్నారు. ప్రతి రోజూ పిల్లలకు గుడ్లు అందిస్తారు. అదేవిధంగా మధ్యాహ్నం భోజనం పెడతారు. అయితే అందరు పిల్లలకీ హాజరువేసి వారికి అందించాల్సిన గుడ్లు, భోజనం పక్కదారి పట్టిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని వీటీ అగ్రహారం 1, 2 సెంటర్‌లో 23, 24 తేదీలకు సంబంధించి హాజరు గురువారం మధ్యాహ్నం 12.30 గంటలు వరకు వేయలేదు. వీటీ అగ్రహారం రెడ్డివీధి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మధ్యాహ్నం 12.30 గంటల వరకు హాజరు వేయలేదు.

సగం మంది లేరు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య కూడా తగ్గుతోంది. పది మంది ఉండాల్సిన కేంద్రంలో ముగ్గురు, నలుగురు మాత్రమే ఉంటున్నారు. 20 మంది ఉండాల్సిన చోట 8 నుంచి 10 మంది మాత్రమే ఉంటున్నారు. కొన్ని కేంద్రాల్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలు మాత్రమే ఉండడం విశేషం.

చర్యలు తీసుకుంటాం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఉదయం 9.30 గంటలకే హాజరు వేయాలి. అలా వేయని కేంద్రాలపై చర్యలు తీసుకుంటాం. పిల్లల సంఖ్య పెంచేవిధంగా చర్యలు తీసుకుంటాం.

బి. అనురాధ, సూపర్‌వైజర్, ఐసీడీఎస్

స్థల పరిశీలన..



మండల కేంద్రంలోని గాయత్రి గ్యాస్ గొడౌన్ సమీపంలో ప్రభుత్వ భూమిలో కాలువ నిర్మాణానికి వచ్చిన ప్రతిపాదనలపై విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి గురువారం స్థల పరిశీలన చేశారు. ఈ మేరకు ఎంత స్థలంలో కాలువ నిర్మించాలి.. ప్రజలకు ఎంతమేర ఉపయోగపడుతుందీ, తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఆమెతో పాటు తహసీల్దార్ తాడ్డి గోవింద, సర్వేయర్ గణపతి రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పీవీ మాధురి, తదితరులున్నారు.

– పూసపాటిరేగ

ఓటుపై అవగాహన..



విద్యార్థులందరూ ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎం.సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని కొమ్మూరు అప్పడుదొర మెమోరియల్ జూనియర్ కళాశాలలోని ఓటుహక్కు ప్రాముఖ్యతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఆదేశాల మేరకు 17 సంవత్సరాలు వయసున్న విద్యార్థులు ముందుగానే ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే సంవత్సరం జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో 1వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలో గాని, పంచాయతీ పరిధిలోని బీఎల్‌ఓల వద్ద గాని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, వీఆర్వోలు వీవీఎస్ఎన్ రాజు, వి. శ్రీనివాసరావు, కంప్యూటర్ ఆపరేటర్ నాయుడు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

– భోగాపురం

సీతారాముల కల్యాణం



సారిక గ్రామ పంచాయతీ పరిధిలోని రామనారాయణం ప్రాంగణంలో పునర్వసు నక్షత్రాన్ని పురష్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు చాణక్య, శ్రీహర్ష ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవంలో ఆలయ ధర్మకర్తలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి, దంపతులతో పాటు రమాదేవి, చంద్రకళ, విక్రమార్క చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం రూరల్

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం



నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని సర్వజన ఆస్పత్రి అడల్ట్స్, హెల్త్ కౌన్సిలర్ అంబళ్ల కొండమ్మ అన్నారు. గురువారం స్థానిక పూల్‌బాగ్ హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ, విద్యార్థినులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు.

– విజయనగరం ఫోర్ట్